

# వలపు ఘాతకి

తిట్టేనోరూ తిరిగేకాలూ వూరుకోవట. ఎవర్నో ఒకర్ని కేక వెయ్యకుండా, ఎక్కడికో ఒకక్కడికి కదలకుండా వుండలేరు అలాటి వాళ్లు.

మహాకవి సార్వభౌముడు శ్రీనాధుడు కేవలం కవేకాదు. రసస్వి, రసజ్ఞుడు, రసలోలుడు. ఆయనకి కుదురుగా కూర్చుని విద్యాధికారిగా సభాకార్యనిర్వహణ చెయ్యడం కానీ, కావ్యరచనా నిర్వహణ చెయ్యడం కానీ కుదరదు.

ఏదో ఆవేశంతో పద్యాలకి పద్యాలు ధోరణిగా అల్లుకుంటూ పోవటం, ఆపై ఏదో జారుముడి వేస్తూ కథ అల్లి కావ్యం పూరించడం బహుశా ఆయన రచనా పద్ధతి ఐ వుండచ్చు. హరవిలాసం చూసినా, భీమేశ్వర పురాణం పరిశీలించినా, కాశీఖండం పరికించినా యిదే అర్థమౌతుంది.

ఆయన ఓసారి -

రాజమహేంద్రవరం బయలు దేరాడు. ఏదో రాచకార్యమో స్వంతపనో నిర్వహించ వలసి వుంది. ఇంకేం వెంట మందీ మార్బలం వచ్చారు. శిష్యగణమూ వెనక నడిచింది. అప్పుడు చెన్నమరాజూ వున్నాడు. చుట్టుపక్కల వున్న పుణ్య క్షేత్రాలు దాక్షారామం, క్షీరారామం, ర్యాలీ, అన్నవరం మొదలైనవి అన్నీ దర్శించుకుని ఆపై ఆయన రాజమహేంద్రవరంలో ఆగాడు.

రాజమహేంద్రవరంలో రెడ్డి రాజుల అన్న సత్రంలో మకాం వేశాడు. ఆ రోజుల్లో - జందెపు మాత్రం బ్రాహ్మణుడైనా (తంతుమాత్రోపజీవి) తమ రాజ్యంలో అభోజనం వుండరాదని రాజాజ్ఞ

మామూలు బ్రాహ్మడికే అంత మర్యాద ఐతే యిక వచ్చింది - కవి అయితే - అందునా కవిసార్వభౌముడైతే - అందునా మరీ శ్రీనాథుడయితే యిక అతిథి మర్యాదలకు కొదవే ముంటుంది.

బసచేసి - ఆపై బసనుంచి బయల్దేరి గౌతమిలో స్నానం చేసి అనుష్ఠానాలు పూర్తి చేసుకుని గట్టెక్కుతూ వుండగా అప్పుడు కనిపించిందో వనిత. సూనసాయకుడి జనత.

ఎలా వుందా ముద్దు గుమ్మ?

కౌనా పేదలకెల్లా పేద - నడుమున్నట్టుగా లేనట్టుంది. పలుకా కర్పూర

ఖండంబు, నెమ్మేనా పైడి శలాక! ముద్దు మొగమా మేలైన కొత్తమ్మి, కొప్పా నీలంబుల కప్పు, నెరి చూపా కంతు చేతూపు, నిన్నీ నేనా నుతియించవాడ తగునా యీ మాట బింబాధరా అన్నట్టుగా వుందావె.

నడుం బొత్తిగా నహీ! పక్కనున్న మరో గానుగ వాళ్ల అమ్మాయితో మాట్లాడ్తున్న ఆ గాండ్ల వారి అమ్మాయి నోరు కర్పూర వాసనలు చిమ్ముతూ వుంది. ఇక ఒళ్లంతా అందమే అన్నట్టు బంగారు శలాకలా వుంది. ముఖం పద్మంలా వుంది. శిరోజాలు మేఘమాలికల్లా వున్నాయి. ఇక చూసే వోరచూపూ వారచూపూ మన్మధుడి బాణాలే! అంత అందగత్తె..... అందునా యిల్లాలు... ఆపై పిల్లతల్లీ అయినా ఎంతందంగా వుంది! వర్ణించడానికి పాతబడ్డ ఉపమానాలే తప్ప కొత్త మాటలు రావడం లేదు. పాతవి చాలడం లేదు.

చూశాక....

చూపోపక.... మనసాగక.... మదిలోని మాట బయటపెట్టేశాడు. గురువు గారి కళ్లల్లోని కాంక్షలు ఆ కాంక్షలు మాటల్లో విరగబడే మధురిమలూ గమనించిన శిష్యవర్గం ఒకడుగు వెనకేస్తే శ్రీనాధుడు మరో అడుగు ముందుకేశాడు. ఆ ముద్దుగుమ్మా గుమ్మడిపండులా వుండీ, మన్మధుడి చేతూపులా నిండీ, మన్మధ వృక్షంలా పండీ, కవిత్వంలో దండి అనిపిస్తోన్న అయ్యగారిని చూసి ముందడుగు వేసింది.

'ఏ వూరు పిల్లా మనది?'

'నాది రాజమహేంద్రం. మరి మీది...'

'కొండవీడు. రెడ్డిరాజుల ఆస్థాన కవులం'

'కవిసార్వభౌములా? నమస్కారం!'

'ఇష్టకామ్యార్థసిద్ధి రస్తు!' తన మనసులోని మాట ఆశీస్సుగా వెలిబుచ్చాడు.

ముసి ముసి నవ్వులు నవ్వి అడిగింది

'అయినింటి ఇల్లాలిని. తగిని వారికిచ్చి చేశారు తలిదండ్రులు... తల్లినీ అయ్యాను తరువాయి ఎందుకని? యిక నాకేం కోరికలు తరువాయి కవిగారూ!'

'నాకుండొచ్చుగా..' తడబడకుండా తత్తర పాటు లేకుండా తపనంతా గుదిగుచ్చినట్టుగా అన్నాడు.

'మీకా!' ఆశ్చర్యం... వెలిబుచ్చింది.

'ఔను బాలా! నిన్ను చూశాక మనసు నిలవ లేదు. పెళ్లయిందని చెప్పినా

కోరిక జిగి బిగి తగ్గలేదు. అందుకే చేతులొగ్గుతున్నాను' సూటిగా అన్నాడు.

'అవ్వ! ఇదేం మాట? ఆ మాత్రం దానికి ఈ మాత్రం ప్రాధేయపడాలా కవిగారూ! తమంత వారు తమకై తమరు తలచి వలచి అడిగితే కాదనడం భావ్యమా? లేదనడం సవ్యమా?'

'ఆఁ'

'ఆఁ రాత్రికి రండి స్వామీ!'

'ఎక్కడికి?'

'కాళిగుడికి...'

'నిజమా! నిజమా! యిదంతా నిజంగా నిజమేనా?'

'నిజమే! నిజమే! నిజమే! ముమ్మాటికీ నిజమే! అదిగో అమ్మోరి గుడి! చీకటి పడితే అమ్మో అనుకుంటూ యిటెవ్వరూ రారు'

శ్రీనాథుడు తటపటాయించాడు నమ్మబుద్ధి కావడం లేదు.

'ఏం భయమా కవిగారూ?'

'అమ్మ వారంటే భయమేకదా?'

పక పక నవ్వింది

'మరి నీకు భయం లేదా?'

'మీరండగా నిండుగా తోడుండగా నాకేం భయం అయ్యగారూ! వస్తా!'

'వస్తావా? మాట తప్పి తప్పిజారి నడవ్వుగా?'

'అంత అనుమానమా? ఛా కవిగారికి... అయితే పదండి. ఆ అమ్మోరి పైన్నే బాస చేస్తా!'

నిబ్బరంగా అంది.

శ్రీనాథుడు నివ్వెరపోతుండగా అమ్మవారి గుడిలోకి తీసికెళ్లి అమ్మవారి తలపై చేయుంచి బాస చేసింది. ఆ అమ్మాయి తెగువ బిగువు మీరింది. శ్రీనాథుడి ఆనందానికి అవధుల్లేవు.

ఆనంధంగా విడిదికి వెళ్లి తేలిగ్గా ఫలహారం తీసుకుని, పూలరంగడిలా తయారై, పూలహారం తీసుకుని ఒక్కడే వచ్చాడు గుడికి. చెన్నమరాజును బస వ్యవహారాలు చూడమని పురమాయించి వచ్చాడు.

కటిక చీకటి కాటుక సముద్రంలా ఎటుచూసినా చీకటి. కటిమీద మక్కువతో వచ్చాడు కవిరాయడు.

గుళ్లో అమ్మవారు

గుడిబయట కవిగారు!

సాదరంగా ఆహ్వానించిన ఆ అమ్మాయి అందచందాలు మనస్సుకు తెమ్పుకుంటున్నాడు కవిగారు.

బాలేందు రేఖ సంపద మించి విలసిల్లు నొసటి తళుక్కుల నీటు సూరు సేయు, భ్రమరికా హరి నీల చమర వాలముల బోల్ వేణీభరము వాయ వేయి సేయు, దర్పణ ద్విజరాజ ధాళధళ్య ప్రభలపస బింబ స్ఫూర్తి లక్షసేయు, గోటహాటక శైల కుంభి కుంభారాతి కుచకుంభయుగళంబు కోటిసేయు, జఘన సీమకు విలువ లెంచంగ వశమె?

వెలలేని వెలది కదా ఆ రతిరూప!

మదిరాక్షి మదిలో మెదలగానే మదనుని తొందర ఎక్కువైంది. కాలం భారంగా జాము సాగింది. ఆమె రాలేదు. కవిగారు ఆమె కోసం కన్ను పొడుచుకున్నా కనరాని ఆ చీకట్లో - కచ్చలో కామయ్య కందులు వేయిస్తుంటే కాల్నిలవక అటూ యిటూ తిరుగుతున్నారు

రెండో జామూ తీరింది.

మూడో జామూ ముగిసింది.

నాలుగో జామూ సగం నడిచింది. గాండ్లసాని రాలేదు.

కవిగారి మనస్సు మనస్సులో లేదు.

నాలుగో జాము నడుస్తుండగా యిక రాదు... రాదు.... అని నిర్ధారణ అయ్యాక.......

అంతసేపూ చలిలో జోగి, విరహంతో కాగి, విసుగుతో ఒంటరితనంతో వేగిన కవిగారికి కోపం చెలరేగింది.

ఎవరి మీద?

ఆరోజు వస్తానని నమ్మబలికి, అమ్మవారి తలమీద చేయుంచి బాసచేసి, వేచి వుండమని చెప్పి, చెప్పినట్టుగా రాక, రాత్రంతా జాగరణం చేయించిన ఆ వనితపై కాదు.

అమ్మవారి మీద!

అంతే ఆశువుగా పద్యప్రసూనాన్ని బాణంలా వదిలాడు కవిగారు

గొఱియల మేకపోతులను కొమ్ము పొటేళ్లను గావుకొందు నీ
వరయగ సంజకాడ తగవత్తు నటంచు భవచ్ఛిరంబుపై
కరమిడిపోయినట్టి తిలఘాతకురాలు తదీయ కేశముల్
పెరుకగ లేవు నీవు వొక భీకరమూర్తివె కాళికేశ్వరీ!

గుండెల్లో మంట గుదిగుచ్చిన మాటలుగా వచ్చింది
అయినా అమ్మవారు కిమ్మనలేదు.

ఒక రేయికి రేయి వృధా అయినందుకు ఉస్సురు మంటూ ఆ వనితను తలుచుకుంటూ విడిదికి మళ్లేడు శ్రీనాథుడు.

* * *